బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 25 సెప్టెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

# 30న బీజేపీ దీక్ష

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ బీజేపీ కీలక నిర్ణయం నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఈ నెల 30న దీక్ష చేపట్టాలని నిర్ణయించింది. ఈ నెల 30న ఇందిరాపార్కు దగ్గర 24 గంటల దీక్ష బీజేపీ చేపట్టనుంది. ఈ దీక్షలో బీజేపీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలు పాల్గొననున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తొమ్మిదిన్నర నెలలవుతున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని బీజేపీ మండిపడుతోంది. రైతు రుణమాఫీ, రైతు భరోసా అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని తెలంగాణ బీజేపీ డిమాండ్ చేస్తోంది. కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ నేతలు అంటున్నారు. రైతు డిమాండ్ల సాధన కోసం ఈ నెల 30న ఇందిరాపార్కు దగ్గర 24 గంటల దీక్ష బీజేపీ చేపట్టనుంది. ఈ దీక్ష అక్టోబర్ 1న ముగియనుంది.

# మూసీ అభివృద్ధి ప్రాజెక్టు నిర్వాసితులకు
# డబుల్ బెడ్ రూం ఇళ్లు

- జీఓ జారీ చేసిన ప్రభుత్వం
- అర్హులైన పేదల వివరాలను సేకరించాలి
- దసరాలోపు మెట్రో విస్తరణ రూట్‌పై పూర్తిస్థాయి డీపీఆర్‌ను సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించాలి
- సీఎం రేవంత్‌రెడ్డి

**మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ అభివృద్ధిలో భాగంగా నిర్వాసితులయ్యే 16వేల బాధిత కుటుంబాలకు డబుల్ బెడ్ రూం గృహాలను కేటాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో 16,002 ఇళ్లను కేటాయిస్తూ జీవో ఇచ్చింది. మూసీ రివర్ బెడ్, బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాలను తొలగించి, నిర్వాసితులకు పునరావాసం కింద వీటిని ఇవ్వనున్నారు. ఇప్పటికే నిర్వహించిన సర్వే ప్రకారం 10,200 మంది నిర్వాసితులు కానున్నట్లు అధికారులు గుర్తించారు. ముందుగా మూసీ రివర్ బెడ్‌లో ఉన్న 1600 నిర్మాణాలను తొలగించి అక్కడ ఉన్న వారిని తరలిస్తారు. మూసీ బఫర్ జోన్‌లో నివసిస్తున్న వారికి భూసేకరణ, పునరావాస చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్మాణ ఖర్చులతో పాటు పట్టా ఉంటే భూమి విలువను చెల్లించడంతో పాటు డబుల్ బెడ్ రూం ఇంటిని ఇవ్వనున్నారు. నిర్వాసితులను సంప్రదించి పునరావాసం కల్పించే ప్రక్రియను కలెక్టర్లు బుధవారం ప్రారంభించ నున్నారు. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో అధికారుల బృందాలు బుధవారం ఇంటింటికి వెళ్లి అక్కడున్న ప్రజలకు, ఎక్కడెక్కడ డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించారో వివరిస్తారు.**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, హైదరాబాద్ మెట్రో రైలుపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆక్రమిత చెరువులు, నాలాలతో పాటు, మూసీ పరివాహక ప్రాంత పరిధిలో నివసించే అర్హులైన పేదల వివరాలు సేకరించాలని అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. వీరిలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం లేదా ఇతర ప్రత్యామ్నాయం చూపి వారికి భరోసా ఇవ్వాలని అధికారులకు సీఎం సూచించారు.

చెరువులు, నాలాల ఆక్రమణల పరిధిలో ఉన్న పేదల వివరాలు కూడా సేకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు లేదా ఇతర ప్రత్యామ్నాయం చూపి వారికి భరోసా ఇచ్చే ప్రయత్నం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. అవుటర్ రింగు రోడ్డు వరకు చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్న సీఎం, కబ్జా కాకుండా పర్యవేక్షించేందుకు చెరువుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రో మార్గంపై నివేదిక తయారు చేయాలని అధికారులకు సీఎం కోరారు. ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణ పనులు వేగంగా చేపట్టాలని పేర్కొన్నారు. మెట్రో మార్గాలకు భూసేకరణ, ఇతర అడ్డంకులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని తెలిపారు. దసరాలోపు మెట్రో విస్తరణ రూట్‌కు డీపీఆర్‌ను సిద్ధం చేసి కేంద్రానికి పంపాలని సీఎం అధికారులను అదేశించారు.

ఈ సమావేశానికి ఎంఏ అండ్ యూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, సర్ఫరాజ్ అహ్మద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు, హైడ్రా కమిషనర్ రంగనాథ్ హాజరయ్యారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు.



## ప్రపంచ సంస్థల్లో
# సంస్కరణలు చేపట్టాలి

- ప్రధాని మోడీ
- న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితిలో సమ్మిట్ ఆఫ్ ద ఫ్యూచర్ మీటింగ్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రపంచ సంస్థల్లో సంస్కరణలు చేపట్టాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి వర్ధిల్లిలాలని ఆయన ఆశించారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితిలో జరిగిన సమ్మిట్ ఆఫ్ ద ఫ్యూచర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సంయుక్తంగా కలిసి ఉండడంలోనే మానవత్వం విజయం సాధిస్తుందని, యుద్ధ రంగంలో కాదు అని ప్రధాని మోడీ తెలిపారు. ప్రపంచ శాంతి, అభివృద్ధి కోసం .. ప్రపంచ సంస్థల్లో సంస్కరణలు కీలకమని, ఆధునీకరణకు సంస్కరణే ముఖ్యమైందన్నారు. ప్రస్తుతం ఉక్రెయిన్, ఇజ్రాయిల్‌లో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఇక భారత ప్రధాని నరేంద్ర మోడీ న్యూయార్క్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు వోల్డోమిర్ జెలెన్స్కీని కలిశారు. ఆ ఇద్దరూ ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్నారు. నెలల రోజుల వ్యవధిలోనే ఆ ఇద్దరూ రెండో సారి భేటీ అయ్యారు. ఆగస్టు 23వ తేదీన ఉక్రెయిన్‌లో మోడీ పర్యటించిన విషయం తెలిసిందే. రష్యాతో జరుగుతున్న యుద్ధాన్ని నిలిపివేసేందుకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు ఆ సమయంలో మోడీ హామీ ఇచ్చారు. తాజాగా న్యూయార్క్‌లో జరుగుతున్న సమ్మిట్ ఆఫ్ ద ఫ్యూచర్ మీటింగ్‌లో కలిశారు.



# ఇద్దరు సీఎంలకు కోర్టులు షాక్

- ఓటుకు నోటు కేసులో విచారణకు రావాలని సీఎం రేవంత్‌కు కోర్టు ఆదేశం




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈడీకి సంబంధించిన కేసులో అక్టోబర్ 16న విచారణకు రావాలని సీఎం రేవంత్‌కు నాంపల్లి కోర్టు ఆదేశించింది.

నాంపల్లి మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టులో మంగళవారం కేసు విచారణ జరిగింది. విచారణకు నిందితుడు జెరుసలేం మత్తయ్య హాజరుకాగా.. రేవంత్‌రెడ్డి, ఉదయ్ సింహా, కృష్ణకీర్తన్, సండ్ర వెంకట వీరయ్య, సెబాస్టియన్ గైర్హాజరయ్యారు. అయితే, నిందితులు ఎందుకు విచారణకు రావడం లేదంటూ సెషన్స్ కోర్టు అసహనం వ్యక్తం చేసింది.ఇవాళ్టి విచారణకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ నిందితులు దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు అనుమతించింది. అయితే, అక్టోబర్ 16న విచారణకు రావాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మిగతా నిందితులకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

2015లో తెలంగాణ ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌ను కొనుగోలు చేసేందుకు.. ఆనాడు టీడీపీ ఎమ్మెల్యేగా రేవంత్ రెడ్డి ముడుపులు ఇచ్చేందుకు ప్రయత్నించారనేది ఏసీబీ ప్రధాన అభియోగం. స్టీఫెన్ సన్‌కు డబ్బులున్న సూట్‌కేసులను రేవంత్ రెడ్డి ఇస్తున్న వీడియో సోషల్ మీడియాల్లో తెగ వైరల్ అయ్యింది.

- కేసులో విచారణను నిలిపివేయాలని
- కర్నాటక సీఎం సిద్దరామయ్య వేసిన పిటీషన్‌ను కొట్టేసిన హైకోర్టు



**బలగం టీవీ, బెంగళూరు**

కర్నాటక సీఎం సిద్ధరామయ్యకు.. హైకోర్టులో చుక్కెదురైంది. ముడా స్కామ్‌లో సీఎంను విచారించాలని గవర్నర్ థావర్ చాండ్ గెహ్లాట్ చేసిన నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సిద్దరామయ్య కోర్టును ఆశ్రయించారు. జస్టిస్ ఎం నాగప్రసన్న నేతృత్వంలోని బెంచ్ ఈ కేసులో తీర్పును ఇచ్చింది. గవర్నర్ గెహ్లాట్ వ్యక్తిగత నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నదని, ఆయన పూర్తిగా మెదడు పెట్టి ఈ నిర్ణయం తీసుకున్నట్లు జస్టిస్ నాగప్రసన్న తెలిపారు. అందుకే సీఎంను ప్రాసిక్యూట్ చేయాలని గవర్నర్ తీసుకున్న నిర్ణయంలో ఎటువంటి లోపం లేదని హైకోర్టు తెలిపింది.మైసూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో సుమారు 14 సైట్లను అక్రమ రీతిలో సీఎం సిద్దరామయ్య భార్యకు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసులో సీఎం సిద్దును విచారించాలని గవర్న్ గెహ్లాట్ ఆదేశాలు ఇచ్చారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం, భారతీయ నాగరిక సురక్షా సంహితలోని సెక్షన్ 218 ప్రకారం.. సీఎంను విచారించే అవకాశాలు ఉన్నట్లు గవర్నర్ తన ఆదేశాల్లో తెలిపారు. సిద్దరామయ్య తరపున ప్రముఖ న్యాయవాది అభిషేక్ మనూ సింఘ్వీ, ప్రొఫసర్ రవివర్మ కుమార్ వాదించారు. ఇక గవర్నర్ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అడ్వకేట్ జనరల్ శశి కిరణ్ షెట్టి తమ వాదనలు వినిపించారు.

## తిరుపతి రెడ్డికి ఒక న్యాయం..
# గరీబోళ్లకు ఒక న్యాయమా..?

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సీఎం సోదరుడు తిరుపతి రెడ్డికి ఒక న్యాయం.. గరీబోళ్లకు ఒక న్యాయమా..అంటూ రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

"హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు రాకుండా క్లీన్ స్వీప్ చేశాం. ఏకపక్షంగా ఓటేసి భారీ మెజార్టీతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను గెలిపించారు. అందుకే హైదరాబాద్‌లో ఉంటున్న పేద ప్రజలపై సీఎం పగబట్టిండు. హైదరాబాద్‌లో ఉండే గరీబోళ్లు.. ఆటో డ్రైవర్లు, బస్తీల్లో ఉండే పేదోళ్ల వెంట పడ్డాడు. సీఎంకు చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే తన అన్నతో పాటు పేదోళ్లను కూడా సమానంగా చూడాలి. వాళ్ల అన్నకు ఒక న్యాయం ఉంటది.. గల్లీల ఉండే గరీబోళ్లకు ఒక న్యాయం ఉంటదా..? దుర్గం చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో తిరుపతి రెడ్డి ఇల్లు ఉంటది. తిరుపతి రెడ్డికి నోటీసులు ఇచ్చి.. కోర్టుకు పోయి కాగితం తెచ్చుకో నిన్ను ముట్ట అని చెప్పాడు. అదే గరీబోడి ఇంటికి తెల్లవారుజామున 3 గంటలకు బుల్డోజర్లు వస్తాయి. పుస్తకాలు తీసుకుంటాం అంటే దయ ఉండదు. బియ్యం తీసుకుంటాం అంటే దయ ఉండదు. చెప్పుల దుకాణంతో బతికేవారిని రోడ్డున పడేస్తారు. బిల్డింగ్‌లు నిర్దాక్షిణ్యంగా కూలగొడుతారు. తిరుపతి రెడ్డికి ఒక న్యాయం.. పేదోళ్లకు ఒక న్యాయమా..? కోర్టులు పని చేయని శని, ఆదివారాల్లో వచ్చి కూలగొడుతున్నారు" అని కేటీఆర్ పేర్కొన్నారు.

మనం పదేండ్లలో కన్‌స్ట్రక్షన్ చేస్తే.. రేవంత్ రెడ్డి డిస్ట్రక్షన్ చేస్తుండు. ఒక్క శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 12 వేల కోట్ల రూపాయాలు పెట్టి పై ఓవర్లు, లింక్ రోడ్లు, అండర్ పాస్‌లతో పాటు ఎస్టీపీలు కట్టాం. మనం మంచి పనులు చేసుకుంటూ పోయాం. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక 9 నెలల కాలంలో ఒక్క మంచి పని చేయలేదు. రియల్ ఎస్టేట్ దందా తప్ప ఒక్కటి మంచి పని చేయలేదని కేటీఆర్ ధ్వజమెత్తారు.

అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిందేవరు..? నీ కాంగ్రెస్ గవర్నమెంట్ కాదా పర్మిషన్ ఇచ్చింది.. ఇప్పుడు ఏదో పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నావు. పేదోళ్ల కడుపు కొడుతున్నావు. హైదరాబాద్‌లో ఎన్ని చెరువులు మాయం అయ్యాయి..? చెరువులను మాయం చేసింది నీ కాంగ్రెసోళు కాదా..? మొన్న నాగార్జునది కూలగొట్టినవ్.. మరి పర్మిషన్లు ఇచ్చింది నీ కాంగ్రెస్ గవర్నమెంట్ కాదా..? దాన్ని కట్టిందే నీ కాంగ్రెస్ హయాంలో 2007, 2008లో. మేం నోటీసు ఇస్తే ఆయన హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నడు.. కాబట్టి మేం ముట్టలేదు అని కేటీఆర్ గుర్తు చేశారు.

ఇక మనం పదేండ్లలో మొత్తం ఆక్రమణలను ప్రోత్సహించామని కాంగ్రెసోళ్లు మాట్లాడుతున్నరు. ఇక ఈ సిపాయిలు వచ్చి కాపాడుతున్నారట. మాట్లాడడానికి ఏమన్న సిగ్గుండాలి. తవ్వు మొత్తం తవ్వు.. తవ్వితే నీ వాళ్లే మొత్తం బయటపడుతారు. కుంభకోణాలు, లంబకోణాలు చేసిందంతా మీ కాంగ్రెసోళ్లే. పట్నం మహేందర్ రెడ్డి గెస్ట్ హౌస్ ఎప్పుడు కూలగొడుతావో కూలగొట్టు.. నీళ్లలో కట్టిండు కదా. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఫామ్ హౌస్ కూలగొట్టు. నీకు దమ్ముంటే

మిగితా 3వ పేజీలో

## కేటీఆర్, బండి సంజయ్ మధ్య ఎక్స్ వార్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



కేంద్ర సహాయ శాఖ మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య ఎక్స్ వేదిక ట్వీట్ యుద్ధం సాగింది. దొంగలు పడిన ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లుగా మీ తీరు ఉందని కేటీఆర్ విమర్శించగా, అస్తిత్వం కోసం కేటీఆర్ డ్రామాలు చేస్తున్నారని బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. ఎక్స్ వేదికగా నేతలు పరస్పరం విమర్శలు గుప్పించుకున్నారు.

"బండి సంజయ్ గారికి" అంటూ మొదట కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ వ్యవహారం దొంగలుపడ్డ ఆరు నెలలకి కుక్కలు మొరిగినట్టు ఉందని విమర్శించారు. మీరు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అన్న విషయం మర్చిపోయినట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. అమృత్ మీ కేంద్ర పథకమేనని, అందులో అవినీతి జరిగిందని ముందుగా చెప్పింది స్వయానా మీ పార్టీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డేనని పేర్కొన్నారు. అయినప్పటికీ పాలు తాగుతున్న దొంగ పిల్లిలా కళ్లు మూసుకున్నారని ఆరోపించారు.ఈ వ్యవహారం మొత్తం ఆధారాలతో తాము బయటపెట్టాక ఈ చిల్లర మాటలు దేనికి సీవీసీ స్వతంత్ర సంస్థ... దానికి మీ సిఫార్సు దేనికి అని ప్రశ్నించారు. అయినా మీ అజబ్ ప్రేమ్‌కి గజబ్ కహానీ అందరూ గమనిస్తూనే ఉన్నారని వ్యాఖ్యానించారు.

కేటీఆర్ ట్వీట్ లేఖకు బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. "మేలుకో బాలుడా... ప్రజలు మీ 'గోల్‌మాల్'ను కొనుగోలు చేయడం లేదు" అని చురక అంటించారు. మీ పెర్ఫార్మెన్స్‌కు కాంగ్రెస్ పార్టీ అదే పనిగా మీకు అభినందనలు తెలియజేస్తోంది అని తెలిపారు. కానీ ఇది మరో 'డ్రామారావు' వ్యవహారం అని ప్రజలకు తెలుసునని పేర్కొన్నారు. ప్రియమైన గజినీ... కాంగ్రెస్ చుట్టూ మీరు డ్యాన్స్ చేయడంలో బిజీగా ఉన్నారు, కానీ బీజేపీ అంతకు ముందు నుంచే అమృత్ టెండర్ల అవినీతిపై మాట్లాడుతోంది అని వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తన స్వంత 'కల్ హో నా హో' దృష్టాంతంలో కూరుకుపోయిందన్నారు. ఎలాంటి అక్రమాలు జరగలేదని వారు నమ్మితే వెంటనే సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ విచారణను కోరాలని డిమాండ్ చేశారు. విచారణ కూడా వేగవంతమయ్యేలా చూస్తామన్నారు. మీ 'అజబ్ ప్రేమ్ కీ గజబ్ కహానీ'లో బీజేపీకి అతిథి పాత్ర అవసరం లేదని, తాము ప్రజల కోసమే ఉన్నామని పేర్కొన్నారు.

## కాళేశ్వరం డిజైన్లు, డ్రాయింగ్‌లు ఎవరు తయారు చేశారు..?

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు ఇంజినీర్లు, మాజీ ఇంజినీర్లు విచారణకు హాజరయ్యారు. ఉన్నతాధికారులకు తెలియకుండా ఈఈ తిరుపతిరావు అనే అధికారి ఏజెన్సీలకు రూ. 1600కోట్ల బ్యాంకు గ్యారంటీలు ఇచ్చినట్లుగా ఇంజినీర్లు కమిషన్‌కు తెలిపారు. బ్యాంకు గ్యారంటీలు ఏజెన్సీలకు ఇచ్చే ముందు అండర్ టేకింగ్ ఏజెన్సీల నుంచి ఏమైనా తీసుకున్నారా అని ఇంజినీర్లను కమిషన్ ప్రశ్నించింది. ఈఎన్సీ కార్యాలయంలో జరిగిన సమావేశం మినిట్స్‌ను అనుసరించకుండానే విడుదల చేసినట్లుగా ఇంజినీర్లు పేర్కొన్నారు. ఆనకట్టల వద్ద డ్యామేజ్‌కు గల కారణాలను కమిషన్ ప్రశ్నించింది. అనుకున్న దానికంటే ఎక్కువ వరద రావడం వల్లే సీసీ బ్లాక్‌లు దెబ్బతిన్నట్లు ఇంజినీర్లు సమాధానం ఇచ్చారు. 2022లో అనుకున్న దాని కంటే ఎక్కువ వరద రావడం వల్లే సీసీ బ్లాక్?లు దెబ్బతిన్నాయని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే ఏజెన్సీలకు లేఖలు రాసినట్లు కూడా కమిషన్‌ను ఇంజినీర్లు వివరించారు.

డిజైన్లు, డ్రాయింగ్‌లు ఎవరు తయారు చేశారని ఇంజినీర్లను జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించగా వ్యాప్కోస్ అనే సంస్థ తయారు చేసినట్లు ఇంజనీర్లు తెలిపారు. సీడీఓ సీఈ అనుమతితో అమలు చేసినట్లుగా స్పష్టం చేశారు. నిర్మాణానికి ముందు సైట్ల వద్ద ఏమైనా పరీక్షలు నిర్వహించారా అని కూడా కమిషన్ ప్రశ్నించగా ఎన్ఐటీ వరంగల్ ఆధ్వర్యంలో పలు పరీక్షలు నిర్వహించినట్లు ఇంజినీర్లు కమిషన్‌కు వివరించారు.

మిగితా 3వ పేజీలో

## విద్యాశాఖలో మరో కీలక నిర్ణయం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి మండలానికి ఒక మండల విద్యాశాఖ అధికారిని నియమించింది. 609 మండలాలకు ఇంచార్జీ ఎంఈవోలను నియమించింది. మండలాల్లోని సీనియర్ ప్రధానోపాధ్యాయుల కు ఇంచార్జీ బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 632 మండలాలు ఉన్నాయి. కాగా అందులో 16 మండలాల్లోనే రెగ్యులర్ ఎంఈవోలు ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల టీచర్లకు బదిలీలు , ప్రమోషన్ల ప్రక్రియ నిర్వహిం చింది. దీంతో ఇంచార్జీ ఎంఈవోలుగా ఉన్న చాలామంది ప్రధానోపాధ్యాయులు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. విద్యాశాఖ బలోపేతం కోసం 609 మండలాలకు ఇంచార్జీ ఎంఈవోలతో పాటు, 16 మండలాలకు రెగ్యులర్ ఎంఈవోలకు బాధ్యతలు ఇచ్చారు. గతంలో ఒక్కో ఎంఈవోకు పలు మండలాలకు ఇంచార్జీ ఎంఈవోలుగా బాధ్యతలు ఇచ్చారు. ఇదిలా ఉండగా రెగ్యులర్ ఎంఈఓలకు 19 సంవత్సరాల తర్వాత బదిలీలు చేపట్టారు. కాగా, మరో ఏడు కొత్త మండలాలు ఐఎఫ్ఎంఐఎస్ వెబ్ సైట్‌లో అప్‌డేట్ అవ్వకపోవడంతో ఆయా మండలాలకు ఎంఈవోల నియామకం పెండింగ్ లో పెట్టారు.

### మైనార్టీ విద్యా సంస్థల్లో
# ఫ్యాకల్టీ పోస్టులకు ఇంటర్వ్యూలు..



- 8 పోస్టులకు 32 మంది హాజరు..

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:**
మైనార్టీ విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ పోస్టులకు ఔట్ సోర్సింగ్, గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిలో భర్తీ చేసేందుకు మంగళవారం జిల్లా కలెక్టర్ చాంబర్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లాలోని ఆయా మైనార్టీ విద్యా సంస్థల్లో జూనియర్ లెక్చరర్ (జే ఎల్) ఇంగ్లీష్, పీజీటీ మ్యాథ్స్, టీజీటీ మ్యాథ్స్, టీజీటీ సైన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జూలజీ పోస్టులకు కోసం దరఖాస్తులు ఆహ్వానించారు. ఒక్కో పోస్టుకు మెరిట్ ప్రకారం ఆరుగురు అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలిచారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన ఆర్ ఎల్ సీ రాజేందర్, డిస్ట్రిక్ట్ ఇంచార్జ్ మైనార్టీ ఆఫీసర్ రాధాభాయ్, ఓఎస్ డీ సర్వర్ మియా, ప్రిన్సిపాళ్లు లక్ష్మీనారాయణ, ఫాతిమా అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. మొత్తం 48 మందిని ఇంటర్వ్యూలకు ఆహ్వానించగా, 32 మంది హాజరు కాగా, 16 మంది గైర్హాజరయ్యారు.

# ప్రభుత్వ విప్‌ను కలిసిన జిల్లా దివ్యంగా సమితి సభ్యులు



**బలగం టీవీ ,వేములవాడ:**
ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ను జిల్లా దివ్యాంగ సమితి సభ్యులు మంగళవారం వారి సమస్యలపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వం ద్వారా ఉపాధి కల్పనలో భాగంగా జిల్లా దివ్యాంగులకు ఔట్సోర్సింగ్ లేదా కాంట్రాక్టు బేసిక్ మీద ఉద్యోగ ఉపాధి కల్పించాలని విన్నవించారు. దివ్యాంగులకు పెట్రోల్ బంక్ కేటాయించాలని, వృద్ధాశ్రమం లాగా వికలాంగులకు ఒక హాస్టల్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. వినతిపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సానుకూలంగా స్పందించడంతో జిల్లా దివ్యాంగ సమితి సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మాదాసు రాజేష్, ఉపాధ్యక్షులు యెల్ల హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేందర్,వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడాల నరేష్ తదితరులు పాల్గొన్నారు..

# లైంగిక దాడి కేసులో ఎమ్మెల్యే అరెస్ట్



**బలగం టీవీ , హైదరాబాద్**
జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్ మలయాళీ సినీ పరిశ్రమను కుదిపేస్తోంది. చాలామంది ప్రముఖ నటీనటులు, దర్శకులు, రాజకీయ నేతలు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో నటుడు, సీపీఐ(ఎం) నేత, కొల్లాం ఎమ్మెల్యే ఎమ్ ముఖేశ్‌పై కూడా ఇలాంటి ఆరోపణలే వచ్చిన విషయం తెలిసిందే. లైంగిక దాడి ఆరోపణల నేపథ్యంలో కేరళ పోలీసులు ఎఫ్ఐఆర్ కూడా కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఆయన మీటూ కేసులో విచారణను ఎదుర్కొంటున్నారు. ఇందులో భాగంగానే కేసును దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ముందు మంగళవారం విచారణకు హాజరయ్యారు. ఇక విచారణలో భాగంగా అతన్ని దాదాపు మూడు గంటల పాటు అధికారులు ప్రశ్నించారు. విచారణ అనంతరం ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకున్న పోలీసులు వైద్య పరీక్షల నిమిత్తం ఎర్నాకులం జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే, ఆయనకు కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేయడంతో వైద్య పరీక్షల అనంతరం విడిచిపెట్టారు.

# దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు డీజీపీకి ఆహ్వానం..

**బలగం టీవీ , హైదరాబాద్**



ప్రముఖ శక్తిపీఠమైన జోగులాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో అక్టోబర్ 3 నుంచి 12 వరకు శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ఈ క్రమంలో బ్రహ్మోత్సవాలకు రావాలని తెలంగాణ డీజీపీ జితేందర్‌కు దేవస్థానం ఆధ్వర్యంలో ఆహ్వానం అందించారు. ఆలయ ఈవో పురేందర్ కుమార్, ప్రధాన అర్చకులు దిండిగల్ ఆనంద్ శర్మ డీజీపీని కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. అలాగే అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్, ఐజీ రమేశ్‌ను కలిసి ఆహ్వానపత్రికను అందించారు. ఈ సందర్భంగా పోలీస్ ఉన్నతాధికారులకు జోగులాంబ అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించి శేషవస్త్రాలతో సత్కరించారు.




# పారాలింపిక్ పతక విజేతకు రూ.కోటీ చెక్కు అందజేసిన సీఎం

**బలగం టీవీ , హైదరాబాద్**
పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించి గర్వకారణంగా నిలిచిన తెలంగాణ యువ అథ్లెట్ దీప్తి జీవాంజికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోటి రూపాయల చెక్కును అందించారు. అలాగే కోచ్ నాగపురి రమేష్‌కి రూ. 10 లక్షల చెక్కును అందజేశారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీప్తి జీవన్‌జీ, కోచ్‌లకు చెక్కులను అందజేశారు. కోటి రూపాయల నగదుతో పాటు ప్రకటించినట్టుగా గ్రూప్ -2 ఉద్యోగం, వరంగల్‌లో 500 గజాల స్థల కేటాయింపుపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. తమకు అందిస్తున్న ప్రోత్సాహంపై దీప్తి జీవాంజి, కోచ్ రమేష్‌లు సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి, క్రీడా శాఖ అధికారులు హాజరయ్యారు.

# పంచాయతీ ముందు మండేపల్లి గ్రామస్తుల నిరసన



**బలగం టీవీ , తంగళ్లపల్లి**
రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గ్రామ ప్రజలు గ్రామపంచాయతీ సిబ్బందిని కేసీఆర్ నగర్ కు కేటాయించడాన్ని నిరసిస్తూ విధులకు వెళుతున్న గ్రామపంచాయతీ సిబ్బందిని అడ్డుకొని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. మండెపల్లి గ్రామ నిధులను డబుల్ బెడ్ రూమ్ లకు మళ్ళించకూడదని కేసీఆర్ నగర్ ని మండెపల్లిలో విలీనం చేయవద్దని డిమాండ్ చేశారు. ఒకవేళ విలీనం చేసినట్లయితే పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకలు చేపడతామన్నారు.అనంతరం పోలీసులు ధర్నా ప్రాంతానికి చేరుకొని గ్రామస్తులకు నచ్చజెప్పి నిరసనను విరమింపజేశారు.

# జాతీయ స్థాయి పోటీలకు బడితండా వాసి ఎంపిక



**బలగం టీవీ , రుద్రంగి:**
రాజన్న సిరిసిల్ల జిల్లా మండలం బడితండా గ్రామనికి చెందిన మాలోత్ అనీల్ కరీంనగర్ లోని ఏస్ఆర్ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ లో డిగ్రీలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జరిగినటువంటి జాతీయ స్థాయి ట్రెక్కింగ్ సెలక్షన్స్ లో ఎంపికతో పాటు అక్టోబర్ నెల 22న హిమాచల్ ప్రదేశ్ లో జరిగే ట్రెక్కింగ్ పోటీలకు ఎంపికవ్వడం అయ్యాడు. దీని పట్ల కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# యూట్యూబర్ హర్షసాయి మోసం చేశాడని యువతి ఫిర్యాదు

- కేసు నమోదు

### చేసిన పోలీసులు



**బలగం టీవీ , హైదరాబాద్**
ప్రముఖ యూట్యూబర్ హర్షసాయి ప్రేమ పేరుతో మోసం చేశాడంటూ ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలు న్యాయవాదితో కలిసి నార్సింగి పీఎస్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. తన వద్ద రూ.2 కోట్లు తీసుకుని పెళ్లి పేరుతో మోసం చేశాడని ఆరోపిస్తోంది ఆ యువతి.ఇప్పటికే హర్ష సాయి బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్నాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఇదిలా ఉండగా తాజాగా హర్షసాయి మెగా అనే సినిమాతో వెండితెరపైకి అడుగు పెడుతున్నాడు.

# ఏపీలో మందిర రథం దగ్ధం..ఐదుగురు అరెస్టు..!

**బలగం టీవీ , అమరావతి**



అనంతపూర్ జిల్లాలోని హనుమంతుడి గుడి రథాన్నిమంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. అయితే ఐదుగురు వ్యక్తులను ఈ విషయంలో అరెస్టు చేశారు. అనంతపురం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ పి. జగదీశ్ ఇది మత విద్వేష ఘటన కాదన్నారు. ఓ వర్గంలోని రెండు గ్రూపుల మధ్య వాగ్వివాద ఫలితంగా ఈ దుర్ఘటన చోటుచేసుకుందన్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రెండు వర్గాల వారు పబ్లిక్ ప్లేస్ లో రథం పెట్టడంపై వాగ్వాదానికి దిగారు. అయితే దాతలు ఆ రథాన్ని తమ ఇంట్లో పెట్టుకోవాలని అన్నారు. అయితే చర్చల అనంతరం రథం ఉంచడానికి ఓ షెడ్ నిర్మించేందుకు అంగీకారం కుదిరిందని, కానీ మంగళవారం తెల్లవారు జామున ఎవరో తగులబెట్టారు. దాంతో ఐదుగురిని పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ఈ వివాదం వెనుక ఉన్న రెండు పక్షాల వారే కారణమని అనుమానిస్తున్నారు. దీనిపై మంగళవారం ఓ ఫిర్యాదు నమోదయింది. ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఘటనను సీరియస్ గా తీసుకున్నారని సమాచారం. దర్యాప్తు జరిపి నేరస్థులను అరెస్టు చేయాలని కూడా ఆయన ఆదేశాలు ఇచ్చారు.

# ఎంపీ పదవికి ఆర్. కృష్ణయ్య రాజీనామా

**బలగం టీవీ , హైదరాబాద్**
వైసీపీ మరో బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను రాజ్యసభ చైర్మన్ జగ్దీప్ ధనఢ్కు అందజేశారు. కృష్ణయ్య రాజీనామాను ఆమోదిస్తున్నట్టు రాజ్యసభ చైర్మన్ ప్రకటించారు. పదవీ కాలం ఇంకా నాలుగేళ్ళు ఉండగానే ఆర్. కృష్ణయ్య రాజీనామా చేశారు. ఇటీవలే రాజ్యసభ సభ్యత్వాలకు బీద మస్తాన్రావు, మోపిదేవి వెంకటరమణ రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

రాజీనామా అనంతరం ఆర్. కృష్ణయ్య మీడియాతో మాట్లాడుతూ.. ఇంకా నాలుగేళ్లు రాజ్యసభ సభ్యుడిగా వ్యవధి ఉన్నప్పటికీ.. బీసీల సమస్యలపై పోరాటం చేసేందుకే పదవికి రిజైన్ చేశానని క్లారిటీ ఇచ్చారు. స్థానిక సంస్థల్లో, చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ల కోసం ఉద్యమం చేస్తున్నానని.. ఈ క్రమంలో తన ఉద్యమానికి రాజకీయ కోణం దిద్దేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని.. అందుకే వైసీపీకి, ఆ పార్టీ ద్వారా దక్కిన ఎంపీ పదవికి రాజీనామా చేశానన్నారు. ఇకపై రాజకీయాలతో సంబంధం లేకుండా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తానని స్పష్టం చేశారు.బీసీల కోసం ప్రత్యేకంగా ఒక పార్టీ పెట్టాలని చాలా మంది కోరుతున్నారని.. దీనిపై సమాలోచనలు చేస్తున్నట్లు తెలిపారు. ఇక నుండి బీసీల సమస్యలపై కలిసి వచ్చే పార్టీలతో ముందుకు వెళ్తానని పేర్కొన్నారు. తన రాజీనామాను వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డికు చెప్పానన్నారు. తనపై నమ్మకంతో తనకు ఎంపీగా అవకాశం కల్పించిన జగన్మోహన్ రెడ్డికి ఆర్ కృష్ణయ్య ధన్యవాదాలు తెలిపారు.

# 4 రోజుల్లో 14 లక్షల లడ్డూల విక్రయం..



- లడ్డూ విక్రయాలపై ప్రభావం చూపని వివాదం

**బలగం టీవీ , అమరావతి**
భక్తులు మహాప్రసాదంగా భావించే తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి, జంతువుల కొవ్వు వినియోగం అంశం ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ అంశం ఏపీ రాజకీయాలను కుదిపేస్తోంది. అయితే, ఈ వివాదం లడ్డూ విక్రయాలపై ఎలాంటి ప్రభావం చూపలేదని టీటీడీ అధికారులు తాజాగా స్పష్టం చేశారు. గడిచిన నాలుగు రోజుల్లో మొత్తం 14 లక్షల లడ్డూలు విక్రయించినట్లు వెల్లడించారు. ఈ నెల 19న మొత్తం 3.59 లక్షల లడ్డూలు అమ్ముడయ్యాయి. సెప్టెంబర్ 20వ తేదీన 3.17 లక్షలు, సెప్టెంబర్ 21న 3.67 లక్షలు, సెప్టెంబర్ 22న 3.60 లక్షల లడ్డూలు అమ్ముడైనట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సగటున రోజుకు 3.50 లక్షల లడ్డూలు విక్రయించామని పేర్కొన్నారు.

శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వులు కలిశాయనే వార్తలు ఇటీవల పెద్ద దుమారం రేపాయి. ఈ క్రమంలో జరిగిన మహా పాపానికి పరిహారంగా తిరుమల శ్రీవారి ఆలయంలో శాంతి హోమం, పంచగవ్య ప్రోక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు మాట్లాడుతూ.. ఆలయంలోని అన్ని విభాగాల్లో ప్రోక్షణ కార్యక్రమాలు చేశామని తెలిపారు. ప్రసాదాల తయారీ కేంద్రాల్లోనూ ప్రోక్షణ చేస్తున్నామని అన్నారు. తెలిసీ తెలియక జరిగిన దోషాలు శాంతి హోమం, ప్రోక్షణతో తొలగుతాయని అన్నారు. చివరగా పూర్ణాహుతి కార్యక్రమంతో అన్ని దోషాలు తొలగిపోతాయని చెప్పారు.

# రెండు మంత్రి పదవులిస్తే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకొస్తామన్నారు

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

**బలగం టీవీ , హైదరాబాద్**
బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారనీ, రెండు మంత్రి పదవులు ఇస్తే ఆ పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలందరూ కాంగ్రెస్‌లోకి వస్తానన్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సంచలన వ్యాఖ్యలు చేశారు.బీఆర్ఎస్ అధినేతపై ప్రజల్లోనే కాదు.. ఆ పార్టీ ఎమ్మెల్యేల్లోనూ నమ్మకం లేదన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ పరిధిలోని గోమారంలో జరిగిన చిన్న ఘటనను హరీశ్ రావు ఇంత రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. అనవసరంగా తమను రెచ్చగొట్టి మిమ్మల్ని మీరే బొంద పెట్టుకోకండనీ హెచ్చరించారు. కాంగ్రెస్ ఒక్కసారి గేట్లు తెరిస్తేనే మీరు తట్టు కోలేకపోయారని ఇక పూర్తిగా తెరిస్తే బీఆర్ఎస్ ఖాళీ అవుతుందని పేర్కొన్నారు.

కేటీఆర్, హరీశ్ రావు కావాలనే కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఇక నుంచి వాళ్లే తమ టార్గెట్ అని అన్నారు. తమ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ వాళ్లవి క్రిమినల్ మైండ్లు అని, విద్యుత్ అధికారులు కొందరు వాళ్లకి సహకరిస్తూ రైతులకు కరెంటు కోతలు విధిస్తున్నారని అన్నారు. అలాంటి చర్యలకు పాల్పడ్డ అధికారులు సస్పెండ్ కాక తప్పదని హెచ్చరించారు. రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి గురించి కేటీఆర్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. ఇక రేపటి నుంచి ఉంటుంది చూస్తో అంటూ మైనంపల్లి హెచ్చరించారు.



మెదక్ జిల్లా శివంపేట మండలం గోమారంలోని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి నివాసంపై దాడి ఘటన విషయం తెలిసిందే. వినాయక విగ్రహ నిమజ్జనంలో భాగంగా సునీతా ఇంటి వద్ద కాంగ్రెస్ శ్రేణులు బాణా సంచా పేల్చడాన్ని బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకున్నాయి.దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ సమయంలో ఇంట్లో సునీతా లక్ష్మారెడ్డితో పాటు కుటుంబసభ్యులు లేరు. వెంటనే పోలీసులు రంగలోకి దిగి, ఇరువర్గాల కార్యకర్తలకు నచ్చచెప్పి పంపించారు. కాంగ్రెస్ శ్రేణులు ఇంట్లోకి వచ్చి తమపై దాడి చేశారని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శివంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# కాళేశ్వరం డిజైన్లు, డ్రాయింగ్‌లు ఎవరు తయారు చేశారు..?

(మొదటి పేజీ తరువాయి)

కాళేశ్వరం ప్రాజెక్ట్ గతేడాది ఎన్నికల సమయంలో భూమి లోపలికి కుంగి పోయింది. దీనిపై విచారణ కోసం తెలంగాణ ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ ఆధ్వర్యంలో కమిషన్ వేసి విచారణ జరుపుతోంది. అలాగే యాదాద్రి విద్యుత్తు ప్లాంటు నిర్మాణంలో జరిగిన అవినీతి, అక్రమాలపై కూడా మొదట్లో ఎల్. నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో కమిషన్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించిన అంశాలపై ప్రస్తుత చైర్మన్ జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ విచారణ జరుపుతున్నారు.

# తిరుపతి రెడ్డికి ఒక న్యాయం.. గరీబోళ్లకు ఒక న్యాయమా..?



(మొదటి పేజీ తరువాయి)

నీ ఎమ్మెల్యేలు, ఎంపీల అక్రమ నిర్మాణాలు కూలగొట్టు. ఆ తర్వాత పేద వాళ్ల మీదకు రా.. అంతేకానీ వీళ్లకు ఎవడు అండగా లేడు.. ఎవడేం చేస్తడు.. వీళ్లను లాగి బజార్లో వేస్తా అన్నట్టు వ్యవహరించడం సరికాదని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు.

ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఆ అక్కలను నమ్ముకుంటే బతుకు జూబ్లీ బస్టాండ్ అయితదని సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని అవమానించిండు. ఇంటింటికి తిరిగి 10 మంది ఎమ్మెల్యేలను చేర్చుకున్నావ్ కదా.. వారి బతుకు జూబ్లీ బస్టాండ్ అయింది. వారిని నువ్వు కాదన్నవడితివి.. మేం కాదన్నవడితిమి. రేపు ప్రజలు కూడా ఛీకొడుతారు. బుద్ధి చెప్తారు. ఇంటింటికి తిరిగి చేర్చుకుని ఇప్పుడు కాదన్నవడితివి.. ఎందుకు భయమేస్తుంది రేవంత్ రెడ్డి. ఎందు కంటే.. మొన్న హైకోర్టు తీర్పుతో రేవంత్ గుండెల్లో దడ మొదలైంది. ఉప ఎన్నికలు వస్తాయి.. ప్రజలు బుద్ధి చెప్తారని రేవంత్ భయపడుతున్నాడని కేటీఆర్ పేర్కొన్నారు.

పదవుల కోసం రేవంత్ రెడ్డి నీతిమాలిన రాజకీయాలు చేస్తున్నారు. దమ్ముంటే ఈయనను పార్టీలో చేర్చుకున్నామని చెప్పు.. కచ్చితంగా అనర్హత వేటు వేస్తామని చెప్పు. ఎన్నికల్లో కొట్లాడుతాం.. మంచి పనులు చేస్తున్నామని చెప్పి ప్రజల్లోకి రా. అలా రా ధైర్యంగా ప్రజలలోకి. హైదరాబాద్‌లో చేసిందేమీ లేదు.. గబ్బు రియల్ ఎస్టేట్ దందాలు చేస్తున్నారు. ఏదో ఒకటి చేసి ఎన్నికలు రాకుండా దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నారు. దీన్ని గల్లీలో స్థానిక నేతలు.. ఢిల్లీలో నీ పార్టీ గమనిస్తుంది. ఎక్కువ కాలం డ్రామాలతో అటెన్షన్ డైవర్షన్ గేమ్‌లతో రాజకీయం నడవదు. ఎక్కువ కాలం ఈ దిక్కుమాలిన కార్యక్రమాలు నడవవు అని కేటీఆర్ పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు రాష్ట్రంలో ఎక్కడికక్కడ స్వైరవిహారం చేస్తూ.. అందినకాడికి దోచుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. సీఎం ఘాతుకాలు, ఆయన కుటుంబ సభ్యులు చేస్తున్న భూ దందాలు, సెటిల్‌మెంట్లు, హైడ్రా పేరు మీద వసూళ్లతో రాష్ట్రం అవినీతిమయంగా మారిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. చిట్టి నాయుడు కథ ఎందుకు చెప్తున్నా అంటే(సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి).. ఆదిలాబాద్‌కు చెందిన ఒక సీనియర్ నాయకురాలు నాలుగైదు నెలల కింద వచ్చి శేరిలింగంపల్లి ఎమ్మెల్యేకు ఫోన్ చేయాలని అడిగారమె. మావోడు అయ్యప్ప సొసైటీలో ఒక బిల్డింగ్ కడుతున్నడు.. జీహెచ్‌ఎంసీ వాళ్లు ఆపుతున్నారట.. ఎమ్మెల్యే చెప్తే అయిపోతదట.. అని ఆమె చెప్పారు. అప్పుడు మన పార్టీలోనే ఉండే.. ఇక నేను ఎమ్మెల్యేకు ఫోన్ చేశాను. సార్ జీహెచ్‌ఎంసీ కాదు.. అయ్యప్ప సొసైటీలో తిరుపతి రెడ్డి ట్యాక్స్ నడుస్తోంది.. 500 గజాల లోపల అయితే ఒక్కో స్లాబ్‌కు 10 లక్షలు, 1000 గజాల లోపు అయితే 18 లక్షలు ఇవ్వాలని జీహెచ్‌ఎంసీ వాళ్లే చెబుతున్నారని మీ ఎమ్మెల్యేనే చెప్పారు. లేకపోతే కూలగొడుతాం అని చెప్పినట్లు చెప్పారు. మాదాపూర్‌లోనే తిరుపతి రెడ్డి ఆఫీసు ఉంది.. రోజుకు 200 మంది కనబడుతున్నారని చెప్పారు. చిట్టి నాయుడు గారి ఏడుగురు అన్నదమ్ముల రాజ్యం నడుస్తుందని మీ ఎమ్మెల్యేను చెప్పిండు అని కేటీఆర్ గుర్తు చేశారు.

అనగనగా..ఓ చిట్టి నాయుడు గారూ.. ఆ చిట్టి నాయుడు గారికి ఏడుగురు అన్నదమ్ముళ్లు.. ఇక తల ఓ దిక్కు పంచుకున్నరు. తిరుపతి రెడ్డి అయ్యప్ప సొసైటీ మీద పడ్డడు. కొండల్ రెడ్డి గుట్టలు, కొండల మీద పడ్డడు. జగదీశ్ రెడ్డికి సడెన్‌గా వెయ్యి కోట్లు వచ్చాయ్. ఆయన తెలంగాణలో ఓ వెయ్యి కోట్ల పెట్టుబడి పెడుతడంట. ఇంకో బామ్మర్దికి 1337 కోట్ల కాంట్రాక్ట్ సీఎం తన డిపార్ట్‌మెంట్‌లో ఇచ్చారు. ఎక్కడికక్కడ స్వైర విహారం చేస్తున్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ ఢమాల్ అయింది. ఎందుకు ఢమాల్ అయిందంటే.. ఈ సీఎం ఘాతుకాలు, కుటుంబం చేస్తున్న భూ దందాలు, సెటిల్‌మెంట్లు, హైడ్రా పేరు మీద వసూళ్లు.. సీఎం ఏం సంబుర పడుతున్నారంటే.. బుగ్గకారు దొరికిందని.. పైన రాహుల్ గాంధీ పిలుస్తుండని.. 22 సార్లు ఢిల్లీకి పోయి వచ్చిండు.. అది పెద్ద గొప్ప పని. ఈ 9 నెలల కాలంలో ఒక్క కొత్త పథకం లేదు. పెన్షన్లు పెంచలేదు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక వారం రోజుల్లోనే పెన్షన్లు పెంచారు. తెలంగాణలో మాత్రం 100 రోజుల్లో ఒక్క కొత్త పథకం కూడా అమలు కాలేదు. శేరిలింగంపల్లి ఉప ఎన్నిక కచ్చితంగా వస్తది. మీలోనే ఒకరు ఎమ్మెల్యే అవుతారు. 10 మంది కార్యకర్తలను కార్పొరేటర్లుగా గెలిపించుకుంటాం. ఈ బాధ్యత మేం అందరం తీసుకుంటాం అని కేటీఆర్ కార్యకర్తల్లో భరోసా నింపారు.

## రూ. కోటి విలువైన గంజాయి పట్టివేత

బలగం టీవీ, భద్రాచలం

నాలుగు రాష్ట్రాల్లో విచ్చలవిడిగా గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముఠాకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణ ఎక్సైజ్ అధికారులు అడ్డుకట్ట వేశారు. ఈ ఘటనలో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకుని.. 10 మంది నిందితులను అరెస్టు చేశారు. వీరిలో నిజామాబాద్ ఎంఐఎం పార్టీ కార్పొరేటర్ కుమారుడు మహమ్మద్ మునవర్ అలీ ప్రధాన నిందితుడు కావడం విశేషం.గత కొన్నేళ్లుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలలో పోలీసులు కన్నుగప్పి గంజాయి అక్రమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. వీరి వద్ద నుంచి సుమారు కోటి రూపాయల విలువైన 319 కేజీల గంజాయిని , రెండు కార్లు, రెండు బైకులు, 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ గంజాయి అక్రమ రవాణాలో నిజామాబాద్ ఎంఐఎం పార్టీ కార్పొరేటర్ కుమారుడైన మునావర్ ఆలీతో పాటు మరో కుటుంబం పూర్తిగా గంజాయి వ్యాపారంలో మునిగి తేలుతుంది.

పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నేరేళ్ల అరుణ, ఆమె కుమారుడు నేరెళ్ల అఖిల్ ఆంధ్రా, ఒరిస్సా సరిహద్దు నుంచి 100 కేజీల గంజాయిని తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. తల్లీ కొడుకులు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడడం విశేషం. నేరెళ్ల అరుణ భర్త కూడా సదయ్య గంజాయి వ్యాపారం చేస్తూ అనేకసార్లు జైలుకు వెళ్లి వచ్చాడు.అయితే ఇప్పటికే మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అనేకసార్లు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డ మునావర్ అలీ.. వీరితో చేతులు కలిపి గంజాయి వ్యాపారం చేస్తున్నారు. ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు నుంచి హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు గంజాయి తరలిస్తున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు వీరిని భద్రాచలం పట్టణంలో అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేకమని ఇలా పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. అత్యంత చాకచక్యంగా అంతర్రాష్ట్ర గంజాయి ముఠా ఆట కట్టించిన భద్రాచలం ఎక్సైజ్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

# లడ్డూ కల్తీ వ్యవహారంపై సిట్

- సిట్ చీఫ్‌గా గుంటూరు రేంజ్ ఐజీ

సర్వశ్రేష్ఠ త్రిపాఠి



బలగం టీవీ, అమరావతి

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారాన్ని తేల్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో హోంమంత్రి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో విచారణకు సిట్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిట్ చీఫ్‌గా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని నియమించింది.సిట్‌లో విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి, కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో పాటు మరికొందరు డీఎస్పీలు. సీఐలు, ఎస్ఐలు సిట్‌లో సభ్యులుగా ఉన్నారు.

తిరుమల లడ్డూలో ఉపయోగించే నెయ్యిని జంతువుల కొవ్వుతో తయారు చేశారని చంద్రబాబు వారం రోజుల క్రితం వెల్లడించిన విషయం తెలిసిందే., ఆ అంశంపై దేశవ్యాప్తంగా దుమారం చెలరేగుతూనే ఉంది. ఏపీ ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంది. కల్తీకి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. ఇందులో భాగంగా సిట్ ఏర్పాటు చేసి నిజనిజాలు వెలికి తీసేందుకు ఐజీ స్థాయి అధికారిని చీఫ్‌గా నియమించింది.

## కామారెడ్డిలో దారుణం..

**విద్యార్థినితో టీచర్ అసభ్య ప్రవర్తన**

బలగం టీవీ, కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో దారుణ ఘటన వెలుగు చూసింది. కామారెడ్డి జీవధాన్ హైస్కూల్లో విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ దారుణాన్ని విద్యార్థిని ఇంట్లో చెప్పడంతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. .. కామారెడ్డి జీవధాన్ హైస్కూల్లో ఓ విద్యార్థినితో అదే పాఠశాలలో పీఈటీ టీచర్‌గా పనిచేస్తున్న నాగరాజు అసభ్యంగా తాకుతూ నీచంగా ప్రవర్తించాడు. అయితే అతని ఆగడాలు పెచ్చుమీరి పోవడంతో బాలిక తట్టుకోలేక విషయం ఇంట్లో చెప్పింది. దీంతో కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు బంధువులతో కలిసి పాఠశాల వద్దకు భారీగా చేరుకున్నారు. తమ కుమార్తె పట్ల ఉపాధ్యాయుడు ప్రవర్తించిన తీరుపై యాజమాన్యాన్ని నిలదీశారు. అనంతరం ఆందోళనకు దిగారు. దీంతో పాఠశాల ఆవరణలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన పాఠశాల వద్దకు చేరుకున్నారు. ఆందోళన విరమించాలని కోరారు.ఈ నేపథ్యంలో పోలీసులు, ఆందోళనకారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇరువర్గాల మధ్య తోపులాట జరగడంతో నిరసనకారులు రాళ్లదాడికి దిగారు. ఈ దాడిలో పట్టణ సీఐ చంద్రశేఖర్ రెడ్డి తలకు రాయి తగిలి గాయమైంది. తీవ్ర రక్తస్రావం జరగడంతో ఆయన్ని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సీఐపై దాడి జరగడం, ఆందోళనకారులు రెచ్చిపోవడంతో పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. దీంతో కామారెడ్డిలో ఒక్కసారిగా హైటెన్షన్ వాతావరణం ఏర్పడింది.

## ట్రిపుల్ ఆర్ బాధితులకు న్యాయం చేయండి..

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**

బలగం టీవీ, హైదరాబాద్

ఉత్తర దిక్కు ట్రిపుల్ ఆర్ బాధితులకు న్యాయం చేస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ప్రియాంకా గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలను బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. మంగళవారం ట్రిపుల్ ఆర్ బాధితులు హరీశ్‌రావును కలిసి తమ బాధలను విన్నవించారు.భువనగిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో బాధితులకు కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ చేత హామీ ఇప్పించి ఇప్పుడు మాట మార్చడం దౌర్భాగ్యమని హరీశ్‌రావు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ తీరు ఓడ దాటే దాకా ఓడ మల్లన్న, ఓడ దాటినంక బోడి మల్లన్న చందంగా ఉందని ధ్వజమెత్తారు. ట్రిపుల్ ఆర్ ఏర్పాటు విషయంలో ఉత్తర భాగంలో 40 కిలోమీటర్లకు బదులుగా 28 కిలో మీటర్లను పరిగణలోకి తీసుకొని జంక్షన్ ఏర్పాటు చేయడం వల్ల చౌటుప్పల్ మున్సిపాలిటీ, మండల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హరీశ్‌రావు తెలిపారు.చౌటుప్పల్ మధ్య నుండి రోడ్డు వెళ్లడం వలన మున్సిపాలిటీ రెండు భాగాలుగా విడిపోతున్నదనీ, బాధితులు రెండు పంటలు పండించే పచ్చని పొలాలను, ఇండ్లు, ప్లాట్లను కోల్పోతున్నారని పేర్కొన్నారు. చౌటుప్పల్ వద్ద జంక్షన్ రింగు గతంలో 78 ఎకరాల్లో ఉంటే ఇప్పుడు 184కు పెంచడం వల్ల పేదల భూములు, ప్లాట్లు కోల్పోతున్నారు. దీనికి గాను నష్టపరిహారం కూడా తక్కువ చెల్లిస్తున్నారన్నారు. దక్షిణ భాగాన ట్రిపుల్ ఆర్ కోసం ఎలాగైతే 40 కిలోమీటర్లు పరిగణలోకి తీసుకుంటున్నారో, ఉత్తర బాగానే ఉన్న చౌటుప్పల్ వైపు 40 కిలోమీటర్లు పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

కోమటిరెడ్డి ఎంపీగా ఉన్నపుడు బాధితులతో కలిసి ట్రిపుల్ ఆర్ మార్చాలని, రాయగిరి, చౌటుప్పల్ రైతులతో కలిసి ధర్నాలు చేశారన్నారు పార్లమెంటు ఎన్నికల సందర్భంలోనూ అలైన్‌మెంట్ మార్చుతామని హామీలు ఇచ్చారు. కానీ, ఇప్పుడేమో అదే పోలీసు బలగాలతో, నిర్బంధంగా రోడ్డుకు 28 కిలోమీటర్ల పరిధిలోనే సర్వే చేయించి, ఒప్పంద పత్రాల మీద సంతకాలు పెట్టాలని బలవంత పెట్టడం దుర్మార్గం. ఇదెక్కడి న్యాయం. ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికల తర్వాత ఒక మాటనా..? అని హరీశ్‌రావు నిలదీశారు.నాడు ఫార్మా సిటీ అన్నారు, నేడు మాట మార్చారు. నాడు ట్రిపుల్ ఆర్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు అన్నారు.. నేడు మాట మార్చారు. మాట మార్చడమే మీ విధానమా? ప్రజలను మభ్య పెట్టడమే కాంగ్రెస్ పద్దతా? మీ మాటలు ప్రజలు నమ్మడం లేదని, ప్రియాంక గాంధీ చేత హామీలు చెప్పించి, మాట తప్పారు. భువనగిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ప్రియాంక గాంధీతో.. ట్రిపుల్ ఆర్ భూములు కోల్పోయిన రైతులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పించారు. కానీ, అధికారంలోకి రాగానే బాధితుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తూ తీవ్ర మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. వేధిస్తూ దాడులకు దిగుతున్నారు అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వరల్డ్ కప్‌లో మహిళా అంపైర్లు



**బలగం టీవి, హైదరాబాద్**

2024 మహిళల టీ20 వరల్డ్ కప్‌కు సంబంధించి ఐసీసీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. మహిళల వరల్డ్ కప్‌ను మరింత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నందున ఆడవాళ్లనే అంపైర్లు గా ఎంపిక చేసింది. మెగా టోర్నీ మ్యాచ్‌ల బాధ్యతలను పూర్తిగా మహిళలకే అప్పగిస్తూ మంగళవారం ఐసీసీ సంచలన ప్రకటన చేసింది. పొట్టి వరల్డ్ కప్ కోసం ఐసీసీ 10మందితో కూడిన మహిళా అంపైర్లను ఎంపిక చేసింది.

ముగ్గురు మ్యాచ్ రిఫరీలుగా కూడా ఆడవాళ్లనే తీసుకుంది. వరల్డ్ కప్ మ్యాచ్‌లకు అంపైరింగ్ చేయనున్న వాళ్లలో క్లెయిర్ పొలొసాక్ అందరికంటే అనుభవజ్ఞురాలు. మరో విశేషం ఏంటంటే.. భారత్‌కు చెందిన జీఎస్ లక్ష్మి మ్యాచ్ రిఫరీగా అవకాశం దక్కించుకుంది.ఆస్ట్రేలియాకు చెందిన ఆమె గతంలో నాలుగు వరల్డ్ కప్ పోటీలకు అంపైర్‌గా వ్యవహరించారు. గత వరల్డ్ కప్‌లో టీవీ అంపైర్‌గా పనిచేసిన సూ రెడ్‌ఫెర్న్ మరోసారి అదే పాత్ర పోషించనుంది. ఇక.. జింబాబ్వేకు చెందిన సారాహ్ దంబనవన తొలిసారి మహిళల టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌లకు అంపైరింగ్ చేయనుంది.

**వరల్డ్ కప్ అంపైర్లు :** రెన్ అగెన్‌బ్యాగ్, కిమ్ కాటన్, సారాహ్ దంబనవన, అన్నా హ్యారీస్, నిమలి పెరీరా, క్లెయిర్ పొలొసాక్, బ్రిందా రథీ, సూ రెడ్‌ఫెర్న్, ఎలోసీ షెరిడాన్, జాక్విలిన్ విలియమ్స్.

**మ్యాచ్ రిఫరీలు :** శాంద్రే ఫ్రిట్జ్, జీఎస్ లక్ష్మి, మిచెల్ పెరీరా.

## చెస్ ఒలింపియాడ్ గోల్డ్ మెడలిస్ట్‌లకు ఘన స్వాగతం



**బలగం టీవి, హైదరాబాద్**

హంగేరి రాజధాని బుడాపెస్ట్‌లో ప్రతిష్ఠాత్మక 45వ చెస్ ఒలింపియాడ్‌లో పాల్గొన్న ప్రజ్ఞానంద, వైశాలి, ఒలింపియాడ్ టీమ్ కెప్టెన్ శ్రీనాథ్ ప్రత్యేక విమానంలో స్వదేశానికి చేరుకున్నారు. వీరికి ఘన స్వాగతం లభించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోెషి, తమిళనాడు సీఎం, స్పోర్ట్స్ మినిస్టర్స్ వారికి అభినందనలు తెలిపారు.

చెన్నై విమానాశ్రయంలో ఈ ముగ్గురు దిగగానే తమిళనాడు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తమిళనాడు వారికి గ్రాండ్ వెల్‌కమ్ ఇచ్చింది. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రజ్ఞానంద, వైశాలి, కెప్టెన్ శ్రీనాథ్ హర్షం వ్యక్తం చేశారు. విజయం సాధించడంపై తమ అనుభవాల్ని, అభిప్రాయాల్ని పంచుకున్నారు.

## నేడు బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశం..!

**బలగం టీవి, హైదరాబాద్**

బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశం బుధవారం జరుగనున్నది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. అపెక్స్ కౌన్సిల్ ఎజెండాలో జైషా స్థానంలో కొత్త కార్యదర్శి నియామకం అంశాన్ని చేర్చకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. బెంగళూరులో జరుగనున్న బోర్డు 93వ వార్షిక సర్వసభ్య సమావేశానికి ముందు జరుగనున్న చివరి అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఇదే.

ఇటీవల ఐసీసీ చైర్మన్‌గా జై షా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ ఏడాది డిసెంబర్ ఒకటిన ఆయన పదవి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎంజీఎంలో బీసీసీఐ కార్యదర్శిగా పూర్తిస్థాయి బాధ్యతల నుంచి జై షా బాధ్యతల నుంచి వైదొలగనప్పటికీ.. నామినేషన్ ప్రక్రియపై చర్చించే అంశాన్ని ఎజెండాలో చర్చలేదు. అపెక్స్ కౌన్సిల్ భేటీలో ప్రధానంగా బైజూ కేస్




అప్‌డేట్‌పై చర్చించనున్నారు. అలాగే బెంగళూరులో అత్యాధునిక వసతులతో నిర్మించిన జాతీయ క్రికెట్ అకాడమీ ప్రారంభోత్సవం అంశంపై సైతం చర్చించనున్నారు. ఎన్‌సీఏ ప్రస్తుతం చిన్నస్వామి స్టేడియం కాంప్లెక్స్‌లో కొనసాగుతున్నది. ముంబయిలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయం, నార్త్ ఈస్ట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అంశంపై సైతం అపెక్స్ కౌన్సిల్‌లో బీసీసీఐ చర్చించనున్నది.

## 'పంత్‌ను సైలెంట్ చేస్తాం

- **ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్**

**బలగం టీవి, హైదరాబాద్**





చెపాక్ స్టేడియంలో మెరుపు శతకం బాదిన రిషభ్ పంత్ బోర్డర్ –గవాస్కర్ ట్రోఫీలోనూ తన ఫామ్‌ను కొనసాగించొచ్చని విశ్లేసకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ స్పందించాడు. ఈసారి పంత్‌ను నిశబ్ధంగా ఉంచుతామని, అతడికి ఏ అవకాశం ఇవ్వమని కమిన్స్ అన్నాడు. 'మ్యాచ్‌ను మలుపుతిప్పగల ఆటగాళ్లు ప్రతి జట్టులో ఒకరో ఇద్దరు ఉంటారు. మా టీమ్‌లో ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్‌లు దూకుడుగా ఆడి మ్యాచ్‌ను లాగేసుకుంటారు. రిషభ్ పంత్ కూడా అలాంటి ప్లేయర్. అతడు ఆడే రివర్స్ స్లాప్ షాట్ చాలా ప్రత్యేకం. అతడు ఈ మధ్యగ గతరెండు సిరీస్‌లలో చాలా ప్రభావం చూపాడు. అయితే.. ఈసారి మేము అతడిని నిశబ్దంగా మారుస్తాం. అతడి దూకుడుకు కళ్లెం వేస్తాం' అని కమిన్స్ తెలిపాడు.




## ఓటీటీలోకి ప్రతినిధి 2

**బలగం టీవి, హైదరాబాద్**

నారా రోహిత్ నటించిన చిత్రం ప్రతినిధి 2. పొలిటికల్ బ్యాక్ డ్రాప్ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రానికి జర్నలిస్ట్ మూర్తి దర్శకత్వం వహించాడు. మే 10న ప్రేక్షకుల ముందుకొచ్చింది. జనం కోసం బతికితే చచ్చాక కూడా జనంలో బతికే ఉంటాం. ఒక వ్యక్తి అన్ని అసమానతలకు వ్యతిరేకంగా మరోసారి నిలబడితే..అంటూ థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులను అంతగా ఇంప్రెస్ చేయలేకపోయింది. చాలా రోజుల తర్వాత ఓటీటీలోకి రానుంది ప్రతినిధి 2. ఈ చిత్రం పాపులర్ తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫాం ఆహాలో సెప్టెంబర్ 27 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మేకర్స్ కొత్త పోస్టర్ విడుదల చేశారు. మరి థియేటర్లలో ఆకట్టుకోని ఈ చిత్రం ఓటీటీలో ఎలాంటి టాక్ తెచ్చుకుంటుందనేది చూడాలి. నారా రోహిత్ ప్రస్తుతం వెంకటేశ్ నిమ్మలపూడి డైరెక్ట్ చేస్తున్న సుందరకాండలో నటిస్తున్నాడు.

## ఆర్జీవీ మూవీ 'శారీ'

**బలగం టీవి, హైదరాబాద్**

విలక్షణ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ నుంచి 'శారీ' అనే చిత్రం రాబోతోంది. పాన్ ఇండియా మూవీగా తెలుగు, హిందీ, తమిళ, మళయాళ భాషల్లో ఈ చిత్రాన్ని నవంబర్ లో విడుదల చేయనున్నారు. గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో 'శారీ'ని ఆర్జీవీ ఆర్వీ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో ప్రముఖ వ్యాపారవేత్త రవి వర్మ ఈ చిత్రాన్ని నిర్మించారు. సత్య యాదు, ఆరాధ్య దేవి హీరో హీరోయిన్లుగా నిజ జీవిత సంఘటనలతో సైకలాజికల్ థ్రిల్లర్‌గా 'శారీ' మూవీ రూపొందుతోంది. 'శారీ' సినిమాతో రామ్ గోపాల్ వర్మ భారతీయ చలన చిత్ర చరిత్రలో ఫస్ట్ టైం ఏఐ లేటెస్ట్ టెక్నాలజీని మ్యూజిక్ డిపార్ట్‌మెంట్‌లో ప్రయోగించారు. అదెలా అంటే సంగీత ప్రపంచంలోనూ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ (కృతిమ మేధ) సప్తస్వరాలతో విన్యాసాలు చేస్తూ మ్యూజిక్ డైరెక్టర్స్‌కే కాదు, పాటల రచయితలకు సింగర్స్‌కు సమానంగా సవాల్ చేస్తుంది. ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ పక్రియతో 'శారీ' చిత్రంలోని 'ఐ వాంట్ లవ్' అనే లిరికల్ వీడియో సాంగ్ విడుదల చేసి సినిమా చరిత్రలో మరో అధ్యాయాన్ని రాశారు.






## 'జటాధర' కొత్తపోస్టర్ విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

సుధీర్‌బాబు హీరోగా రూపొందుతున్న చిత్రం 'జటాధర'. 2025 శివరాత్రికి ఈ సినిమా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి కొత్తపోస్టర్‌ను మేకర్లు విడుదల చేశారు. పౌరాణిక, ఫాంటసీ, డ్రామా అంశాల కలయికగా ఈ చిత్రం తెరకెక్కనున్నట్లుగా పోస్టర్‌ను చూస్తే అర్థమవుతుంది. సుధీర్‌బాబు సరికొత్త లుక్‌తో శక్తివంతమైన పాత్రలో కనిపించబోతున్నారని సమాచారం. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్‌బాబు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ 'జటాధర ఫస్ట్ లుక్ పోస్టర్‌కు వచ్చిన ఆదరణ చూసి ఆశ్చర్యపోయా. ఇంత గొప్ప స్పందన రావడంతో సంతోషమేసింది. ఆ సంతోషాన్ని మాటల్లో చెప్పలేను. ఈ సినిమాలో అడుగుపెట్టడం అనేది ఓ సరికొత్త ప్రపంచాన్ని నాకు పరిచయం చేసింది. నాకు ఇది ఎప్పటికీ మర్చిపోలేని అనుభవం. శాస్త్రీయ, పౌరాణిక అంశాల కలయిక స్క్రిప్ట్‌ను రాశారు. ఈ రెండో జోనర్లుకు చెందిన ప్రపంచాలను ఆడియన్స్ వెండితెరపై చూస్తున్నపుడు ఓ సరికొత్త సినిమా అనుభూతిని పొందుతారు. ఓ సినిమా సక్సెస్‌కైనా కారణం బలమైన స్క్రిప్ట్. దీనికి మంచి టీమ్ తోడైతే అది మంచి అది మంచి సినిమాగా ప్రాణం పోసుకుంటుంది. మా సినిమా విషయంలోనూ అదే జరుగుతుంది' అంటూ వివరించారు. సుధీర్‌బాబు నటించిన 'మా నాన్న' సూపర్ హీరో సినిమా అక్టోబర్ 11న విడేదల కానుంది.